కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

కేశవరావు ఎన్‌కౌంటర్‌పై విచారణ జరపాలి

తొర్రూరు, మే 24: మావోయిస్టు అఖిలభారత కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ శనివారం పట్టణంలో సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్, న్యూడెమోక్రసీ నాయకులు కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ ఎన్‌కౌంటర్ల పేరుతో ఆదివాసీలు, అమాయక ప్రజలను చంపడం ఆపాలని, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతిచర్చలకు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చేందుకు ఆదివాసీ ప్రాంతాల్లో దాడులు చేస్తూ, నిబంధనలను లెక్కచేయకుండా అప్రకటిత యుద్ధం సాగిస్తున్నారని విమర్శించారు. ప్రజల సమస్యలు పరిష్కరించకుండా వ్యక్తులను చంపటం ద్వారా విప్లవాన్ని అడ్డుకోవడం సాధ్యం కాదని హెచ్చరించారు. మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ నాయకులు మంగళపల్లి శ్రీనివాస్, కొత్తపల్లి రవి, ఎండీ యాకుబ్, బందు మహేందర్, ఆలకుంట్ల సాయిలు, ముంజంపల్లి వీరన్న పాల్గొన్నారు.

రైతులకు జీలుగ విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు పెట్టాలి

మహబూబాబాద్ రూరల్, మే 24 : నకిలీ విత్తనాలు అమ్మినవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. శనివారం పట్టణ శివారు ఏటిగడ్డ తండా రైతువేదికలో రైతులకు పచ్చిరొట్టపై నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు జీలుగ విత్తనాలు వేసుకొని కలియదున్నడం ద్వారా పచ్చిరొట్ట ఎరువుగా మారి భూమిలో సారం పెరుగుతుందని తెలిపారు. ఆర్గానిక్ ఫార్మింగ్ దిశగా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. భవిష్యత్ తరాలకు కలుషితం లేని ఆహారాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు. పంట పండించిన తర్వాత వరి మొదళ్లు కాల్చటం ద్వారా పోషకాలు అందించే సూక్ష్మజీవులు చనిపోతాయని తెలిపారు. అనంతరం రైతులు జీలుగ విత్తనాలను అందజేశారు. జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల, ఏడీఏ శ్రీనివాస్‌రావు, ఏవో తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం లారీ బోల్తా.. డ్రైవర్‌కు స్వల్పగాయాలు

కురవి, మే 24: ధాన్యం లోడు లారీ బోల్తా పడిన ఘటన మండల కేంద్రం శివారు ఏకలవ్య మోడల్ స్కూల్ వద్ద ఖమ్మం జాతీయ రహదారి మూలమలుపులో శనివారం జరిగింది. లారీడ్రైవర్ రోశయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సీరోలు మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి లారీలో ధాన్యాన్ని లోడ్ చేసుకుని కేసముద్రం లోని రైస్‌మిల్లుకు బయల్దేరాడు. కురవి శివారులోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ మూలమలుపు వద్దకు రాగా డీసీఎంను తప్పించేందుకు రోడ్డు పక్కకు వెళ్లగా, ఎదురుగా గ్రానైట్‌లారీ రావడంతో మరింత పక్కకు వెళ్లగా బోల్తా పడింది. ధాన్యం బస్తాలు కిందపడిపోయాయి. చూసిన వారు పోలీసులకు సమాచారం అందించారు. లారీడ్రైవర్ తలకు గాయమైంది. 108 సిబ్బంది వచ్చి ప్రాథమిక చికిత్స అందించారు. కురవి ఎస్సై కృష్ణారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

సైబర్ మోసం.. రూ.1.31లక్షలు మాయం

మహబూబాబాద్ రూరల్, మే 24 : సైబర్ నేరగాడి చేతిలో ఒకరు రూ.లక్షా 31వేలు పోగొట్టుకున్నాడు. రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గాంధీపురానికి చెందిన షేక్ జిలానీ ఫోన్‌కు ఆన్‌లైన్‌లో క్రెడిట్‌కార్డ్ ద్వారా డబ్బులు పెడితే కమీషన్ వస్తుందని మెసేజ్ వచ్చింది. ఆశతో రూ.లక్షా 31వేలు పంపాడు. కొన్ని రోజులైనా డబ్బులు తిరిగి జమ కాకపోవడంతో మోసపోయినట్లు తెలుసుకొని శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు లిపారు.

పురుగులమందు తాగి..

మరిపెడ, మే 24: పురుగులమందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యా యత్నం చేసుకున్న ఘటన మండలంలోని బావోజీగూడెంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జామ రవి కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన 108లో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

కురవి, మే 24: సీరోలు మండలం రేకులతండా ఆకేరువాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఆర్ఐ యాకూబ్‌పాషా శనివారం తెలిపారు. రెండు ట్రాక్టర్లకు రూ.10వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

డోర్నకల్, మే 24: జీలుగ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగ్రోస్ సేవ కేంద్రం, సొసైటీల్లో జీలుగ, జనుము ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైల్వేగేట్‌ను పునఃప్రారంభించిన అధికారులు

గార్ల - డోర్నకల్ రైల్వే గేట్ ఓపెన్

గార్ల, మే 24: గార్ల నుంచి డోర్నకల్ వెళ్లే రైల్వేగేట్ నెల రోజులుగా మూడో లైన్ పనుల్లో భాగంగా రైల్వే ఉన్నతాధికారులు మూసివేశారు. మూడో లైన్ పనులు పూర్తి కావడంతో శనివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైల్వేగేట్‌ను ఓపెన్ చేశారు. గార్ల నుంచి డోర్నకల్ వరకు వాహనాలు రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయి.

సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, మే 24 : జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మట్టూరి నాగేశ్వర్‌రావు కోరారు. శనివారం కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ దవాఖానల్లో పనిచేస్తున్న డాక్టర్లకు ప్రైవేట్ హాస్పిటళ్లు ఉన్నాయని, జిల్లాలో అక్రెడిటేషన్ కలిగి ఉన్న జర్నలిస్ట్ కుటుంబ సభ్యులకు ఆయా హాస్పిటళ్లలో ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని ఆయన కోరారు.

సీడీపీవో ఆఫీస్‌లో ఖాళీ కుర్చీలు

- ఉదయం పదకొండైనా రాని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రజలు

అధికారులు ఎవరూ రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

మహబూబాబాద్ రూరల్, మే 24 : పట్టణంలోని ఐసీడీఎస్ పరిధి సీడీపీవో కార్యాలయంలో శనివారం ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఉదయం పదకొండు గంటలైనా కార్యాలయానికి ఒక్క అధికారి కూడా రాలేదు. దీంతో పనుల మీద వచ్చిన ప్రజలు కార్యాలయంలో అధికారులు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడంలేదని వారు వాపోయారు. కార్యాలయం పక్కనే ఆర్డీవో కార్యాలయం, కలెక్టర్ క్యాంప్ కార్యాలయం ఉన్నప్పటికీ సీడీపీవో కార్యాలయ అధికారులు విధులపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహిస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు. ఈ ఘటనపై సీడీపీవో శిరీషను వివరణ కోరగా తాను రెండు రోజులుగా సెలవులో ఉన్నానని, యూడీసీ, జూనియర్ అసిస్టెంట్‌లు పీడీ కార్యాలయంలో పని ఉందని వెళ్లారని, సీనియర్ అసిస్టెంట్ అనారోగ్యం కారణంగా సెలవులో ఉన్నాడని, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కార్యాలయానికి రారని, అటెండర్ ఒక్కరే ఉన్నారని పేర్కొన్నారు.

పంట మార్పిడి చేసుకోవాలి

శాస్త్రవేత్తలు మాలతి, రాంబు

సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త మాలతి

కొత్తగూడ, మే 24: పంటల మార్పిడితో అధిక దిగుబడులు సాధించాలని కేవీకే మల్యా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మాలతి, కేవీకే మల్యాల శాస్త్రవేత్తలు డాక్టర్ రాంబాబు అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా శాస్త్రవేత్తలు హాజరై రైతులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ యూరియా తక్కువ వాడి ఖర్చు తగ్గించుకోవాలన్నారు. మందులను అవసరం మేరకే పిచికారి చేసుకోవాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులు, పశువుల పెంట, చెరువు మట్టి వల్ల పోషకాలు పెంచుకొని దిగుబడి సాధించుకోవాలన్నారు. మండల వ్యవసాయధికారి జక్కుల ఉదయ్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ రవిరాథోడ్

భ్రూణ హత్యలను నిరోధించాలి

మహబూబాబాద్ రూరల్, మే 24 : భ్రూణ హత్యలను నిరోధించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రవి రాథోడ్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలోని వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఫీమేల్ లింగ నిష్పత్తి తక్కువగా ఉందని, అబార్షన్ రేటు ఎక్కువగా ఉందని, ఎక్కడైతే ఫీమేల్ నిష్పత్తి తక్కువగా ఉందో ఆయా మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అబార్షన్లు చేసినా, ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించాలని, అలా చేసేవారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని సూచించారు. డాక్టర్లు జగదీశ్వర్, నగేష్, నాగమణి, చైల్డ్ హెల్ప్ లైన్ మెంబర్స్, ఆరోగ్యవిద్యా బోధకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి

మహబూబాబాద్ రూరల్, మే 24 : విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతిచెందిన ఘటన పట్టణ శివారులో శనివారం జరిగింది. మున్సిపాలిటీ శివారు సలార్‌తండాకు చెందిన గంగ తన గేదెలను శనివారం మేత కోసం వదిలేసింది. గడ్డి మేస్తుండగా విద్యుత్‌వైర్ తెగి మీద పడటంతో షాక్ తగిలి అక్కడిక్కడే మృతిచెందిందని బాధితురాలు తెలిపింది. పాలు ఇచ్చే గేదె మృతిచెందగా తీవ్రంగా నష్టపోయానని వాపోయింది.



సన్మానిస్తున్న రామాలయ కమిటీ సభ్యులు

జవాన్‌కు సన్మానం

బయ్యారం, మే 24: ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న జవాన్ అజహార్‌ను కోదండరామ స్వామి ఆలయ కమిటీ, ఉపాధ్యాయులు, సీసీఎం ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. మండల కేంద్రానికి చెందిన అత డు ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని దేశభక్తి చాటి చెప్పే అవకాశం లభించడం గర్వకారణమని పలువురు తెలిపారు.

కొత్తూరు(సీ)లో పరిశీలిస్తున్న తహసీల్దార్ పున్నచందర్

కొనుగోలు కేంద్రాల పరిశీలన

కురవి, మే 24: సీరోలు మండలం కొత్తూరు, తాళ్ల సంకీస, సీరోలు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ పున్నంచందర్ శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రెండు రోజుల్లో ధాన్యం మొత్తం మిల్లులకు తరలిస్తామని ఆదేశించారు. కురవిలో బోల్తా పడిన ధాన్యం లారీలోని ధాన్యాన్ని వేరే లారీలో పంపించినట్లు తెలిపారు.

తొర్రూరులో తిరంగా ర్యాలీ

తొర్రూరు, మే 24: కశ్మీర్ పెహల్గాంలో హిందువులపై ఉగ్రదాడికి ప్రతిగా భారత త్రివిధ దళాలు నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' విజయాన్ని పురస్కరించుకొని పట్టణంలో శనివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. రామకృష్ణ థియేటర్ నుంచి కూరగాయల మార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కూరగాయల మార్కెట్ వద్ద జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ 'ఆపరేషన్ సిందూర్'లో భారత సైన్యం ఒక్క రాత్రిలోనే పాక్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసి, వంద మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టిందని తెలిపారు. పాకిస్తాన్ ఆర్మీకి భారీ నష్టం వాటిల్లిందని, ఉగ్రవాదంపై భారత్ నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. పలువురు స్థానిక నేతలు, యువకులు పాల్గొన్నారు.

వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

గూడూరు, మే 24: వివాహితను రెండేళ్లుగా వేధిస్తున్న ఓ వ్యక్తిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొల్లాపురానికి చెందిన మట్టపల్లి నవనీతరావు గ్రామంలోని ఓ వివాహితను రెండేళ్లుగా ఫోన్ చేసి వేధిస్తున్నాడు. ఈ క్రమంలో ఆమె ఎవరికీ చెప్పుకోలేక ఈనెల 17వ తేదీన పురుగులమందు తాగింది. చికిత్స పొందిన తర్వాత కోలుకున్న ఆమె శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా ఇదే విషయంలో నవనీతరావుపై గ్రామానికి చెందిన నిమ్మలబోయిన వెంకన్న, నీలం రమేశ్, నీలం సైదులు, నీలం సతీష్, గుడిసె సంతోష్ దాడిచేయగా తీవ్రగాయాలయ్యాయి. అతడి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఎస్టీ న్యాయవాదుల సమాఖ్య ఉపాధ్యక్షుడు బాలాజీ బహిష్కరణ

మహబూబాబాద్ రూరల్, మే 24 : గిరిజన ఎస్టీ న్యాయవాదుల సమాఖ్య జిల్లా ఉపాధ్యాక్షుడు బానోత్ బాలాజీ సంఘానికి వ్యతిరేకంగా వ్యవహరించడం వల్ల ఆ పదవి నుంచి బహిష్కరించినట్లు గిరిజన ఎస్టీ న్యాయవాదుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య మోహన్‌నాయక్, ప్రధాన కార్యదర్శి బానోత్ లాలూ నాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంఘం ఎన్నిక తమ గిరిజన న్యాయవాదుల సమక్షంలో జరగలేదని, వారే ఎన్నిక చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈ నవ్య

రైతులు జాగ్రత్తలు పాటించాలి

చిన్నగూడూరు, మే 24: విద్యుత్ ప్రమాదాల నివారణకు రైతులు వ్యవసాయ బావుల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని ఏఈ నవ్య తెలిపారు. మండలంలోని ఉగ్గంపల్లిలో శనివారం విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించి ప్రమాదాల నివారణకు రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు, ఇతర సమస్యలేవైనా ఉంటే సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సబ్ ఇంజినీర్ జహూర్‌పాషా, సిబ్బంది నారాయణ ఉన్నారు.

లచ్యతండాలో పరిశీలిస్తున్న నాగేశ్వరావు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మరిపెడ, మే 24: వానకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రోగ్రాం ఆఫీసర్ నాగేశ్వరావు తెలిపారు. శనివారం ప్రోగ్రాం ఆఫీసర్ లక్ష్మీనారాయణతో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని లచ్య తండలో సార్వత్రిక వ్యాధి నిరోధక కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. దోమల నిర్మూలన – సీజనల్ వ్యాధులపై తగిన సూచనలు, సలహాలను ఇచ్చారు. వైద్యాధికారి గుగులోత్ రవి, సూపర్‌వైజర్ మంగమ్మ, పద్మ, రాములమ్మ పాల్గొన్నారు.

ఊరకుంట అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

బయ్యారం, మే 24: మండలంలోని గంధంపల్లి కొత్తపేట ఊరకుంటను మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దేందుకు రూ.10లక్షలతో చేపట్టిన పూడికతీత పనులకు ఎమ్మెల్యే కోరం కనకయ్య శనివారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఊరకుంట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించామని, మినీ ట్యాంక్‌బండ్‌గా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రవీణ్‌నాయక్, సీతారాంరెడ్డి, రామ్మూర్తి, అన్నపూర్ణ, సురేశ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి

'రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రప్రభుత్వం'

దంతాలపల్లి, మే 24: రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ రాజ్యాంగ మూలసూత్రాలకు విఘాతం కలిగిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఉద్యమించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో దంతాలపల్లి మండల 3వ మహాసభ వీరయ్య అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. మత విద్వేషాలను రెచ్చగొడుతూ రాష్ట్రపతి, గవర్నర్ వంటి అత్యున్నత పదవులను బీజేపీ ప్రభుత్వం స్వార్థ ప్రయోజనాలకోసం వినియోగించుకుటున్నట్లు ఆరోపించారు. మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా పోలెపాక వెంకన్న, కో కన్వీనర్‌గా రాజశేఖర్‌తో పాటు ఐదుగురి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాకసాయిలు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మా ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నడు

- వాస్తు కోసమని తనకు అమ్మాలంటున్నడు
- రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ బెదిరిస్తున్నడు
- బలపాల లింగ్యాతండాకు చెందిన బాధిత దంపతుల ఆవేదన

ఇంటి స్థలాన్ని, పన్ను రశీదులను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

కురవి, మే 24: 'పాత ఇంటికి కూల్చేసుకొని కొత్త ఇల్లు నిర్మించుకోవాలనుకుంటే మా ఇంటి వెనుక ఇల్లున్న కాంగ్రెస్ నాయకుడు, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ మాలోత్ నెహ్రూనాయక్ అడ్డుకుంటున్నాడు. మీ ఇల్లు అడ్డుగా ఉండడం వల్లే తాను ఎమ్మెల్యే కాలేకపోతున్నానని బెదిరిస్తున్నడు' అని మండలంలోని బలపాల లింగ్యాతండాకు చెందిన భూక్య మంగీలాల్, బుజ్జి తెలిపారు. తండా గ్రామ పంచాయతీ పరిధిలో భూక్య రాము ఇల్లు నిర్మించుకున్నాడు. ఇద్దరు ఆడపిల్లలు, ముగ్గురు కుమారులు. ఇంటి స్థలం చిన్న కుమారుడు మంగీలాల్‌కు వచ్చింది. రోడ్డు కంటే ఇల్లు లోతట్టుగా ఉండటంతో వర్షం కురిసినప్పుడు ఇంట్లోకి వరద నీరు వస్తోంది. దీంతో కొత్త ఇంటిని నిర్మించుకుందామని నిర్ణయించుకున్నాడు. ఇతడి ఇంటిని ఆనుకొని పీరీల కొట్టం, దాని పక్కనే ఇంటి వెనుక భూక్య నెహ్రూనాయక్‌కు ఇల్లు ఉంది. కొత్తగా ఇల్లు నిర్మాణం చేయొద్దు.. స్థలం తనకే ఇవ్వాలని కోరాడని, అంగీకరించకపోవడంతో తమకు చెందిన పీరీల కొట్టం స్థలంలో కొంత తనది ఉందని, అదిచ్చి మిగతా ప్రదేశంలో ఇల్లు కట్టుకోవాలని మెలిక పెట్టినట్లు బాధితులు తెలిపారు. ఆతర్వాత కోర్టుకు వెళ్లి పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులకు నోటీసులు ఇచ్చాడని పేర్కొన్నారు. తాను కన్నెర్ర చేస్తే తట్టుకోలేరని బెదిరిస్తున్నట్లు వాపోయాడు. 'మీ ఇల్లు ఉండటం వల్లే ఎమ్మెల్యే కాలేక పోతున్నాను. ఈశాన్యం మూసివేయడంతో కలిసి రావడం లేదంటున్నాడు' అని వాపోయారు. తాము తాతల కాలంలో ఇల్లు నిర్మించుకున్నామని, ఇంటి పన్ను కడుతున్నామని, తమ ఇంటి తర్వాత కట్టిన పీరీల సావడిలో దేవుడి స్థలం ఉందంటూ నెహ్రూనాయక్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇంటి స్థలం ఇస్తే డబ్బులు ఇస్తామని, లేకుంటే ఇల్లు కట్టనిచ్చేది లేదని మధ్యవర్తుల ద్వారా చెప్పించి భయపెడుతున్నాడని వాపోయారు. 'సొంత స్థలంలో నుంచి రెండు గజాల పీరీల సావడికి వదిలిపెట్టిన. అధికారులు వచ్చి రోడ్డు కిందకిపోతోందని, ఇల్లు కట్టం ఆపాలని బెదిరిస్తున్నారు. ఇంటి స్థలం ఇవ్వడం లేదని వ్యవసాయభూమికి వెళ్లకుండా దారిని జేసీబీతో తవ్వింది. రోజుకో చికాకు పెడుతుంది. మా పాణం పోయినా ఇల్లు వదలం. పోలీసులవద్దకు అన్ని ఆధారాలతో వెళ్తే కోర్టు నోటీసులు ఇప్పించింది.' అని వాపోయారు. కాగా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు శనివారం తండాలోని బాధితుల ఇంటి స్థలాన్ని పరిశీలించారు. తాతల కాలం నుంచి నివసిస్తున్న ఇంటిని కూలగొట్టుకుని కొత్త ఇల్లు నిర్మించుకునేందుకు అధికారులు ఎందుకు పర్మిషన్ ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అధికారులను బాధ్యులను చేస్తూ జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు భూక్య కిషన్‌నాయక్, జిల్లా నాయకులు చీకటి మహేశ్‌గౌడ్, బుడిగె భద్రసేనాగౌడ్, గడ్డం అశోక్, పల్లె సందీప్, జాటోత్ వీరన్న, కోడి రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యనందించాలి

మహబూబాబాద్ రూరల్, మే 24 : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని ఏకశిల ఏంజిల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతులను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉపాధ్యాయులు తరగతిలో విద్యార్థుకు వివరించాలని సూచించారు. రాష్ట్రంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో తీసుకువచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మురళీనాయక్‌ను గెజిటెడ్ హెడ్ మాస్టర్లు గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, అప్పారావు, శ్రీరాములు, చంద్రశేఖర్ ఆజాద్ పాల్గొన్నారు.

నెల్లికుదురు: మాట్లాడుతున్న ఎంఈవో రాందాస్

మరిపెడ: సైబర్‌క్రైమ్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ రాజ్‌కుమార్‌గౌడ్

శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు చేయాలి

నెల్లికుదురు: ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదుల్లో అమలు చేసి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఎంఈఓ ఏ.రాందాస్ అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో మండలస్థాయి ఉపాధ్యాయ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఎంఈఓ మాట్లాడుతూ బోధన మూసపద్ధతిలో కాకుండా వినూత్నంగా, వినసొంపుగా టీచింగ్, లర్నింగ్ మెథడ్, ఆట–పాటలతో బోధించినప్పుడే విద్యార్థుల్లో విషయజ్ఞానం పెంపొందుతుందన్నారు. సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య, ఉచిత సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి విద్యా సంవత్సరంలో విద్యార్థుల నమోదు శాతాన్ని గణనీయంగా పెంచాలన్నారు. డీఆర్పీ కే రాకేశ్, ఎమ్మార్పీలు లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, రాజు, సంతోశ్, కరుణాకర్, రమేశ్, సుధాకర్, సీవో హెచ్ ఉపేందర్, సీఆర్పీలు బొడ్డు వీరస్వామి, బైరు కవిత, జంపాల కవిత, డీ.రవి, మెసేంజర్ ఆర్ యాకయ్య పాల్గొన్నారు.

టీచర్లు సైబర్ నేరస్తుల ఉచ్చులో పడొద్దు

మరిపెడ: టీచర్లు సైబర్ నేరస్తుల ఉచ్చులో పడొద్దని మరిపెడ సీఐ రాజ్‌కుమార్ గౌడ్ అన్నారు. శనివారం మరిపెడ, చిన్నగూడూరు మండలాలకు చెందిన ఉపాధ్యాయుల పుర పాలక సంఘ పరిధిలోని మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఐదు రోజుల వృత్యంతర శిక్షణ ముగింపు సందర్భంగా ఎంఈఓ గాదె అనితాదేవి అధ్యక్షతన సైబర్‌క్రైమ్‌పై అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడారు. ఉపాధ్యాయులు సైబర్ నేరస్తుల వలలో చిక్కుకొని డబ్బులు నష్టపోవద్దని, ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని చెప్పారు. ఎస్సైలు సంతోష్‌కుమార్, అంజమ్మ, రిసోర్స్ పర్సన్స్ లింగాల మహేశ్‌గౌడ్, దోమల లింగయ్య, యాదగిరి, వెంకన్న, శ్రీను, మంగు, మంగీలాల్ పా